పదం దృక్పథం
సాయి బ్రహ్మానందం గొర్తి

# ఛాయాపహారులు

## అన్నమయ్య పదాలు సామాజిక దృక్పథాలు

కవిత్వమనేది ఒక సృజనాత్మకమైన ప్రక్రియ. నిబద్ధతో కూడిన స్పందనా చైతన్యానికి సృజనాత్మకమైన భావజాలాన్ని అద్ది పాఠకుల హృదయాల్లో కురిపించే అతి సున్నితమైన సృజనా కౌముదే కవిత్వం అంటే! ఒకరకంగా చెప్పాలంటే ప్రపంచం గుండె లోతుల్లోకి చూస్తూ ప్రపంచం దృష్టిని తనవైపు మరలించేదే కవిత్వం ! అలా చేసినప్పుడే అది సృజనాత్మక కవిత్వం అవుతుంది. ఒకే దృశ్యాన్ని చూసిన ఏ ఇద్దరి స్పందనా ఒకేలా ఉండదో, అలాగే ఏ ఇద్దరి కవుల కవిత్వం ఒకేలా ఉండదు. ఒకవేళ ఒకేలా ఉంటే మొదటవచ్చిన కవిత్వానికి అనుసరణనో లేదా అనుకరణనో, అచ్చు గుద్దు నట్లు మక్కీకి మక్కీ దించేస్తే భావ చౌర్యమనడం కద్దు. మనిషికి విజ్ఞానం పెరిగి వ్యాపార దృక్పథం కూడా అబ్బింది కాబట్టి, నేటి సమాజంలో చట్టాల రూపంగా కూడా వచ్చింది. దాన్నే మనం కాపీ రైటు అంటూ ఉంటాం. అంటే కవిత్వమైనా, కథ అయినా ఒక కవి సృజనలో పుట్టింది కాబట్టి అది ఆ కవి సొంతం. ఎవరైనా అది ఆ కవిగారి అనుమతి లేకుండా ప్రచురించినా, కాపీ కొట్టినా శిక్షార్హులుఅన్నది కాపీ రైటు చట్ట ఉద్దేశ్యం. ఈ మధ్య సాంకేతిక విజ్ఞానం పెరిగింది కాబట్టి ఎవరైనా ఏదైనా ఒక సంగీతాన్ని కానీ ఒక సినిమాని కానీ కొనుక్కోకుండా కాపీ చేసుకుంటే నేరం అని చదువుతూ ఉంటాం. సినిమావాళ్ళు దీన్నే పైరసీ అంటున్నారు.

ఎవరైనా ఏ సినిమా అయినా వీడియో పైరసీ చేస్తే మాకు తెలియ పరచండి మేం చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం అంటూ ప్రకటనలూ చూస్తున్నాం. వాళ్ళు తీసే సినిమా కథలు అన్నీ ఏదో ఒక సినిమా కాపీయే అన్నది వేరే విషయం అనుకోండి. మనం గొంతెత్తి అరిచినా ఎవరూ పట్టించుకోరు. ఇది జగమెరిగిన సత్యం. ఈ చేట భారత ఉపోద్ఘాతం ఎందుకంటే ఈ భావచౌర్యం అన్నది ఈ మధ్యనే కొత్తగా పుట్టిన జాడ్యం కాదు. అన్నమయ్య కాలంలోనూ ఉంది చెప్పడానికే! అన్నమయ్యకి కూడా ఈ భావచోరుల బెడద తప్పలేదు. అంటే దాదాపు నాలుగు వందల ఏళ్ళ క్రితం కూడా కవులూ కవిత్వం వెలుగొందినట్లే అక్కడక్కడ ఈ భావచోరులూ యథాశక్తి పుట్టుకొచ్చారు. కాకపోతే ఒకటే తేడా అప్పుడు కవులూ, కవిత్వం ఎక్కువ ఇప్పుడు కవులనుమించిన సంఖ్యలో భావచోరులెక్కువ అంతే తేడా.

అన్నమయ్య రాసిన పదాలు బహుళ ప్రాచుర్యం పొందిన సమయంలో కొంతమంది అన్నమయ్య ననకరిస్తూ పద కవిత్వం రాయడం మొదలు పెట్టారు. వారి భావచౌర్యం చూసి అన్నమయ్య పని తప్పంటూ ఓ పద కవిత రాసాడు. భావచౌర్యం అని ప్రత్యేకించి పదం వాడలేదు కానీ, ఛాయాపహారులంటూ వాళ్ళదుమ్ము దులిపేలా ఓ పదకవిత రాశాడు.
తన పదకవితలను అనుకరించిన వారిని కటువుగా గర్హించాడు.

వెరులాల మీకు వేడుక గలితేను
అరువంచి తడుకల్లంగ రాదా // పల్లవి //

ముడిచివేసిన పువ్వు ముడువ యోగ్యం గాదు
కుడిచి వేసిన పుల్లె కుడువ గా గాదు
బడి నొకరు చెప్పిన బ్రతి చెప్పబోతేను
ఆడరి శ్రీహరి కది అరుహము గాదు. //వెరు//

కవిత్వం రాయాలన్న వేడుక కలిగితే, నడుంవంచి తడకల్లినట్లుగా కాస్త పరిశ్రమ చేయచ్చు కదా? పక్కవాళ్ళదాన్ని తస్కరించడం ఎందుకు?
ఒకసారి ముడిచిన కవిత్వ కుసుమం ఇంకో సారి ముడువ యోగ్యం కాదంటూ సుతిమెత్తగా మందలించాడు.

గంపెడుముక దినగా నొక్క వరిగింజ
తెంపున గలసితే తెలియ నెట్టువచ్చు
జంపుల బలవరించగ నొక మంచి మాట
ఇంపైతే హరి యందు కిచ్చునా వరము // వెరు //

ఉమిసిన తమ్మలో నొక కొంత కప్రం
సంకూర్చి చవిగొని చప్పరించనేల
అమరంగ ఛాయాపహారము చేసుక
తమమాటగూర్చితే దైవము నగడా // వెరు //

ఓ ఒకరు తిని ఉమ్మివేసిన దానికి కాస్త ఉప్పు కారం అద్ది చప్పరించడం ఎందుకు? అందుబాటులో ఉందికదా అని చాయాపహారము చేస్తే దైవము మెచ్చునా? అంటూ ఖండించాడు.

చిబికి వేసిన గింజ చేత బట్టనేల
గబుక కెంగిలిబూరె గడుగగ మరియేల
తొబుక కవిత్వాల దోషాల బొరలితే
దిబుకార నవ్వడా దేవుడైనాను // వెరు //

మించు చద్దికూటిమీద నుమిసినట్టు
మంచి దొకటి చెప్పి మరి చెప్పనేరక
కంచు బెంచు నొక్కగతి నదికితే ముట్టు
పెంచువలనే చూచు పెరుమాళ్ళు వాని // వెరు //

పుచ్చినట్టి పండు బూజి లోననేవుండు
బచ్చనకవితలు బాతిగావు యెందు
ముచ్చు గన్నతల్లి మూల కొదిగినట్లు
మృచ్చిమి నుతులేల మొక్కరే హరికి // వెరు //

ఒకరు రాసిన కవిత్వం ఇంకొొకరు అపహరించడం, ఒకరు ఎంగిలి చేసిన బూరెను వేరొకరు కడుక్కొని తినడం లాంటిదే అంటూ ఎద్దేవా చేసాడు అన్నమయ్య..తన కవిత్వాన్ని వేరుకరు అపహరిస్తే అన్నమయ్య గుండె ఎంతగా పగిలిందో ఇవి చూస్తేనే అర్థం అవుతోంది.

ఉల్లి దిన్నకోమటూరక వున్నట్టు
జల్లెడ నావాలు జారిపోయినట్టు
కల్లలు జెప్పి యా కథ కుత్తరములీక
మెల్లన ఉండితే మెచ్చునా దైవము? // వెరు //

నేతి బీరకాయ నేయి అందు లేదు
రాతివీరునికి బీరము ఇంచుకాలేదు
ఘాత బూరుగుబండు కడుపులోన దూది
ఏతుల నుడుగులు ఎక్కునా హరికి // వెరు //

ఇరుగువా రెరుగలు పొరుగువా రెరుగరు
గొరబైన మాటలు గొణుగుచూ నుందురు
పరుల గాదందురు బాతి గారు తాము
విరసులట్టి వారి విడుచు దేవుడు // వెరు //

ఎన్నగ శ్రీవేంకటేశు దాళ్ళపాక
అన్నమాచార్యులు అఖిల దిక్కుల మెచ్చ
నున్నతితో బాడి రొక డెవ్వడో తాను
సన్న నొరసునట సమ్మతా హరికి // వెరు //

ఉల్లితిన్న వాసన ఊరికే పోతుందా? ఒకరి కవిత్వం నాది అన్నంతమాత్రాన పదిమందికి తెలియదా? నేతిబీరకాయలో నేయిలేనట్లే ఛాయాపహారుల కవిత్వంలో వారి సొంత సృజన లేదు. ఆ కవిత్వం బూరుగు పండులా ఉంటుంది. పైకి గట్టిగా ఉన్నా లోపలంతా డొల్లతనమే కదా?

సాధారణంగా అన్నమయ్య పదకవితల్లో చరణాలు ఏడు, మహా అయితే ఎనిమిది మించి లేవు. కానీ ఈ పదకవిత మొత్తం పది చరణాలు ఉంది అంటే, ఈ ఛాయాపహారులనండి లేదా భావచౌర్యులనండి అన్నమయ్య హృదయాన్ని ఎంతగా గాయపరిచారో తెలుస్తుంది.



ఎంతో శ్రమించి మథనపడి, భావ సాంద్రత కలిగిన సృజనని ఎవరైనా తస్కరిస్తే కొండల రాయడుకి కూడా కడుపు మడందా? ఆ మంటల వేడి ఛాయాపహారుల ప్రహారీని కూల్చదా? ఒకటి కాదు, రెండు కాదు తన హృదయాన్ని తాకిన ప్రతీ విషయానికీ కవితా రూపంలో స్పందించాడు అన్నమయ్య. అందుకే ఆ మహానుభావుడి సాహిత్యం ఈ రోజు వరకూ అజరామరంగా నిలిచిపోయింది.